www.yugabharath.com
Volume : 2 Issue : 8 December, 2017


# యుగభారత్

YUGABHARATH
Monthly Magazine

మాస పత్రిక

• సంపుటి : 2
• సంచిక : 8
• డిసెంబర్, 2017
• పేజీలు : 44
• వెల : రూ. 10/-
• హైదరాబాద్





# నమస్తే అన్నా...

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

మేము శ్రీనివాస కాలనీలో ఇల్లు అద్దెకి తీసుకున్నాం. ఇవాళ మంచి రోజని పంతులు చెప్పడంతో పాలు పొంగించి సామానుతో షిఫ్ట్ అయిపోదామని నిర్ణయించుకుని అప్పటికే ఇంటిని శుభ్రంగా కడిగించి ముగ్గులేయించి ఉంచడంతో డైరెక్ట్‌గా మా దంపతులం, పిల్లా పీచుతో (ఆరేళ్ల కొడుకు, ఐదేళ్ల కూతురితో) ఇలవేల్పు శ్రీ వేంకటేశ్వరుడి ఫోటోను చేబూని కుడి కాలు పెట్టి గృహప్రవేశం చేసి పాలు పొంగించి ఇలా కూర్చున్నామో లేదో బక్కపలచగా, ఐదూ ఏడు హైట్‌తో (ఎల్.ఐ.సి. ఏజెంట్‌ను కాబట్టి హైట్ పక్కా చెప్పగలను) ఒక యువకుడు మా ముందు 'నమస్తే అన్నా. నా పేరు శీను." అంటూ ఊడిపడి "మీరు ఈ కాలనీకి కొత్త కదే! నేను ఈ కాలనీలనే ఉంటా, ఎల్ప్ చేయనీకి వచ్చిన" అన్నాడు. మాట వరసకలా అన్నాడనుకుని 'అచ్ఛే.. మేము సర్దుకుంటాం. లారీతోపాటు ఇద్దరొచ్చారు వాళ్ళు సహాయం చేస్తారులే" అన్నాను నవ్వుతూ.

నీకు తెల్వదే. వాళ్ళు పైసలకి పన్జేసేటోళ్ళు. మనం దిల్‌తోని పన్జేస్తాం. మస్తు పైసలు పెట్టి చానా సోంచాయించి సామాను గొనుంటరు. డామేజైతే పానం పోదా. అందుకే మీరు ఫికరు గాకుండ్రి. మీ సామాను మొత్తం బద్రమ్గా లోపలికి జేర్చి సద్దే పని నాది' అని అనడమే కాకుండా గబగబ చొరవగా పనిలోకి దిగిపోయి రెండు గంటల్లో ఎక్కడి వస్తువులు అక్కడ చక్కగా అమర్చాడు. నిజానికి మేము ఒళ్ళు హూనం చేసుకోవడం తప్ప అంత చక్కగా సర్దుకోలేం. పైపెచ్చు రెండు మూడు రోజులు పట్టేది. అతని పనితనానికి ముచ్చటేసింది. అతను మా ఇంటికి దగ్గరగా ఉన్న సదుపాయాలన్నీ విడమరచి చెప్పాడు. బావుండదని ఓ ఐదొందల నోటిచ్చి మంచి హోటల్లో అతనితో సహా అందరికీ భోజనం తెమ్మని చెప్పాను. పదిహేను నిముషాల్లో వేడి వేడి పదార్థాలతో వచ్చాడు. అసలే అలసిపోయి ఉన్నామేమో ఆవురావురుమంటూ తినేశాం. పదార్థాలు రుచిగా, శుచిగా అద్భుతంగా ఉన్నాయి. తినేశాక ఇంకా అక్కడే నిలబడి ఉన్నాడు శీను.

నేను పని పూర్తయిందన్నట్టుగా రెండుసార్లు అతణ్ని చూసి నవ్వాను. అతనూ నవ్వాడు. ఇదంతా గమనించిన నా భార్య నన్ను పక్కకు పిలిచి పాపం ఇంట్లోకి సామాను మోయడంలో, సర్దడంలో చాలా కష్టపడ్డాడు. ఏమన్నా ఇచ్చి పంపించండి" అంది కరణేషు మంత్రిగా. "కడుపు నిండా అన్నం పెట్టాంగా" అన్నాను మధ్య తరగతి మనసుతో. 'ఊరోండి, ఆ లారీతో వచ్చిన పనివాళ్ళకి అన్నం పెట్టి డబ్బు లియ్యట్లా. అంది చిరుకోపంతో.

శీకన్ను

రు మనకుండా

బయటకొచ్చి పర్స్‌లోంచి అయిదు వందలు తీసిచ్చాను. అతని ముఖం మతాబులా వెలిగిపోయింది. అప్పటి నుంచి మా ఆవిడకి కూరలోకి కర్వేపాకు కావలసి వచ్చినా, ఆటో రాకపోతే పిల్లల్ని స్కూల్లో దింపాలన్నా, పోస్టాఫీస్‌లో ఆర్డీలు కట్టాలన్నా ఎలా తెలిసేదో కాని క్షణాల్లో వాలిపోయి పని పూర్తి చేసేవాడు. అతనుండడం వల్ల మా ప్రాణానికి ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉంది. ఇచ్చింది తీసుకునే వాడు తప్ప ఏదీ నోరు తెరిచి అడిగే వాడు కాదు. ఆ కాలనీలో ఓ నెల రోజులు విజయవంతంగా పూర్తి చేశాకా పరిచయం అయిన కాలనీ పర్సనాల్టీలతో మాట్లాడుతూ శీను విషయం కదిపినప్పుడు నాకు అర్థమైన విషయం ఏమిటంటే– శీను

కాలనీ వాళ్లందరికీ ఇలాగే సహాయం చేస్తాడని. అతనికి వృద్ధాప్య తల్లిదండ్రులు, ఒక చెల్లె ఉందనీ. దాదాపు ఆరేళ్ల నుంచి అలా కాలనీకి సేవ చేస్తున్నాడితను. అతను చేసే పనికి మేమిచ్చే పదో పరకో ఏం సరిపోతుంది? నాకు జాలేసింది. అతనికేమన్నా చేయాలనిపించింది. ఒకసారి మాటల సందర్భంలో అతని చదువు గురించి అడిగాను. మంచి చదువే. ఉద్యోగ ప్రయత్నాలు చేసుంటాడు. వచ్చుండదు. అందుకే ఇలా అందర్నీ నమ్ముకుని బతుకుతున్నాడు. మళ్లీ జాలేసింది. నేను ప్రైవేట్ కంపెనీలో హెచ్.ఆర్. మేనేజర్‌గా చేస్తున్నాను. అతనికి ఉద్యోగం ఇప్పించడం క్షణాల్లో పని. 'అతనికి ఉద్యోగమిచ్చి దారి చూపించాలి' మనసులో గట్టిగా నిర్ణయం తీసుకున్నాక ఎందుకో కాస్త గర్వంగా అనిపించింది. ఉండదూ ఇప్పటి దాకా శీనుని అందరూ వాడుకున్న వాళ్లే తప్ప దారి చూపించిన వాళ్లు లేరు. ఇదే విషయం మా ఆవిడతో చర్చించాను. 'పాపం ఆ సహాయం చేసి పుణ్యం కట్టుకోండి' అంది ఆనందంగా. నా నిర్ణయానికి మరో ఆమోద ముద్ర. ఒక రోజు సాయంత్రం ఆరున్నరకి ఆఫీసు నుంచి వస్తుంటే పార్క్ దగ్గర ఎదురుపడ్డాడు శీను. శీను ఇలా రా, నీతో కొద్దిగా మాట్లాడాలి" అన్నాను. వచ్చాడు నవ్వుతూ,

ఇద్దరం పార్క్‌లో కూర్చున్నాం. శీనూ మా అందరికీ సహాయం చేయడం తప్ప నువ్వు వేరే ఉద్యోగం చూసుకోవా? అమ్మానాన్నల్ని చూసుకోవాలి, చెల్లెలి పెళ్లి చేయాలి. బాధ్యతలున్నాయి కదా అన్నాను మందలింపుగా. చేస్తున్నగద సర్. సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ అన్నాడు.

"నీ మొహం. సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ అంటే స్వయం ఉపాధి. నీ కాళ్ల మీద నువ్వు నిలబడి సంపాదించుకోడం. అంతేకాని ఇలా నలుగురికీ సహాయం చేసి వాళ్లిచ్చే పదీ పరక తీసుకోవడం కాదు. ఇలా ఎంత కాలం బతగ్గలవు. సర్లే మా ఆఫీసులో ఒక పొజిషన్ వేకెంట్‌గా ఉంది. పెద్ద వాళ్లతో మాట్లాడి నీకొచ్చేలా చేస్తాను.

రేపు నీ రెజ్యూమ్ ఇవ్వు" అన్నాను. నా మాటల్లో గర్వం అసంకల్పితంగా కలగలిసింది.

శీను కాసేపు మౌనం వహించాడు. బహుశా ఆనందంతో మాట రావడం లేదనుకున్నాను. "సార్. ఎందుకో తెల్వది, గీ కాలనీ మా ఫ్యామిలీలెక్క అన్పిస్తది. ఎవరికో పని చేస్తున్నట్టుండది. మనోళ్లకి చేస్తున్నట్టు ఉంటది. ఇయ్యలటి రోజుల్ల ఇంట్ల ఎవరి తీరు ఆరిదైనది. పైసలు కమాయించడం ఎక్వయినది. బద్దకంతోని ఇంట్ల పనులు సేసుకుంటలేరు. పదో పరకో ఇచ్చి నా అసొంటోడి సేత పని సేయించుకుంటుండ్రు. నేను ప్రతి ఇంట్ల ఒక పిల్లాన్నయినా, తల్చుకుంటే మస్తు కుష్ అయితది. ఇంటి పక్కింటోల్ల పేరు తెల్వదు కాని నా పేరు అందరికీ ఎరుకే! నా అదురుష్టం సూడుండ్రి! గీ కాలనీ అంతా నాదనుకుంటున్నా, ఇంద కొంత మందయినా నేను వాల్లోననుకోరా సారూ! నా సెల్లి పెళ్లి సేయనీకి సాయం సేయరా సెప్పుండ్రి, సేస్తరు. పుట్టినందుకు గిది సాలదా సారు! ఇంకేం కావాల, మీరిచ్చే ఉద్యోగం వద్దు సార్. గది వస్తే అందరిలెక్క నేను కాలనీల ఒక్కడినైత, కాలనీ అంతా నాదవదు. నాకిట్లగె బాగుంది. ఇట్లనే ఉండనీయి సార్!" అన్నాడు. 'సరే' అన్నట్టుగా లేచి నుంచున్నాను. వాడి మాటలకి నా కళ్లలో సన్నటి కన్నీటి పొర. "వస్త సార్. సుందరం సార్కి మందులు తెవ్వాలి" అని వడివడిగా వెళ్లిపోయాడు. "మనుషుల మీద బతికేవాళ్లుంటారు కాని మనుషుల కోసం బతికేవాళ్లు చాలా అరుదు. అలాంటి వాళ్లను కాపాడుకోగలగాలి. నేను ఇక్కడున్నా, మరెక్కడున్నా నిన్ను మాత్రం కనిపెట్టుకునుంటాను. అందరినీ దారంలా కలుపుకుపోతూ అవసరాలు తీర్చే నీకు ఎప్పుడైనా అవసరం వస్తే నేను తీరుస్తాను మనసులో స్థిరంగా నిర్ణయించుకుని ఇంటి వైపు కదిలాను. ❖

# ఒక్క శాతం మంది వద్ద ప్రపంచ సంపదలో సగం!

ప్రపంచ సంపదలో సగంకన్నా ఎక్కువ... ఒక్క శాతం మాత్రమే ఉన్న మహాసంపన్నుల చేతుల్లోనే ఉందని ఒక నివేదిక వెల్లడించింది. ప్రపంచంలో అసమానతలు ఊహించని స్థాయిలో పెరుగుతున్నాయని దీనిని బట్టి అవగతమవుతున్నది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఏర్పడిన తరువాతి పరిస్థితులను మహా ధనవంతులు ఎంతగా వినియోగించుకొని, ఎంతగా ప్రయోజనం పొందారన్న దానికి ఈ అధ్యయనం వెల్లడించిన విషయాలు నిదర్శనంగా పేర్కొనవచ్చు.

ఆర్థిక మాంద్యం ఉన్న కాలంలో ప్రపంచంలోని మొత్తం సంపదలో 42.5 శాతం మాత్రమే సంపన్నుల చేతుల్లో ఉండగా, ఇప్పుడు అది 50.1 శాతానికి పెరిగిందని క్రెడిట్ స్యూస్ ఎ గ్లోబల్ వెల్త్ అనే అధ్యయన సంస్థ తెలిపింది. మహా కోటీశ్వరులలో అగ్ర భాగాన ఉన్న ఒక శాతం వ్యక్తుల వద్దనే 106 ట్రిలియన్ డాలర్ల విలువైన సంపద ఉందని, ఈ మొత్తం అమెరికా ఆర్థిక వ్యవస్థ విలువ కంటే ఎనిమిది రెట్లు అధికం అని వెల్లడించింది.

ప్రపంచంలోని 87.8 శాతం సంపద అంతా కోటీశ్వరులైన కేవలం పది శాతం మంది చేతుల్లోనే ఉందని, 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం తరువాత పరిస్థితులు వేగంగా మారాయని, అగ్ర శ్రేణిలోని ఒక శాతం సంపన్నులే ఇంకా పై..పైకి... ఎదిగారని నివేదిక పేర్కొంది. పేదలకు, ధనవంతులకు మధ్య దూరం ఇంకా ఎక్కువైంది. కోటీశ్వరులు, బాగా డబ్బు (30 మిలియన్ల డాలర్ల కంటే ఎక్కువ) ఉన్నవారి సంఖ్య 170 శాతం పెరిగిందని, అంతకంటే బాగా డబ్బున్న వారి సంఖ్య ఐదు రెట్లు పెరిగిందని తెలిపింది.

ఒక్క బ్రిటన్ దేశంలోనే అటువంటి వారిలో ఆరు శాతం మిలియనీర్లు ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో మహా సంపన్నులున్న దేశాల్లో బ్రిటన్ మూడో స్థానంలో ఉంది. పేద, ధనిక వర్గాల మధ్య అసమానతలు ఎక్కువ కావడమే మిలియనీర్ల సంఖ్య వేగంగా పెరగడానికి కారణమవుతున్నదని నివేదిక వివరించింది.

మొత్తం ప్రపంచ సంపదలో కేవలం 2.7 శాతం మాత్రమే 350 కోట్ల మంది పేదల వద్ద ఉంది. కాబట్టి ఒక్క బ్రిటన్ మాత్రమే కాదు, అన్ని దేశాల నాయకత్వాలు ఈ విషయాన్ని గమనించి అసమానతలు తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ❖